క్లుప్తంగా

కొండపల్లికి స్పెషల్ గ్రేడ్ కమిషనర్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ నూతన స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా పి.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ మంగళవారం రాత్రి జీఓ జారీ చేశారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాసరావు బదిలీపై ఇక్కడకు రానున్నారు. ప్రస్తుతం మున్సిపాల్టీ కేడర్ రేషియో లేనందున గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా నియామకం అయ్యి రెండు రోజుల్లో కొండపల్లి కమిషనర్‌గా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

క్రీడాకారులకు అభినందన

జి.కొండూరు: స్కూల్ గేమ్స్ మండల స్థాయి పోటీల్లో కవులూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 22 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు, పీడీ శ్రీలతను పాఠశాల హెచ్ఎం నాగేంద్రరావు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటి జిల్లా స్థాయిలో పోటీపడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని పీడీ శ్రీలతకు వారు సూచించారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి

జూపూడి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో మహిళలు పనిచేసే ప్రదేశాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వైద్యురాలు పర్వీన్ అన్నారు. నిమ్రా ఫార్మసీ కళాశాలలో మహిళల భద్రతపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలకు రక్షణ కల్పించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులు ఆమెను ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్, ప్రొఫెసర్ రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మికులపై వేధింపులు, తొలగింపులు ఆపాలి

నూజివీడు: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్కూళ్లలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై వేధింపులు, తొలగింపులు పెరిగాయని, వాటిని వెంటనే ఆపాలని సీఐటీయూ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు జి. రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్టోబర్ 2న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులకు కరపత్రాలను పంచి ప్రచారం చేశారు. రాజు, యూనియన్ జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాలను, మెనూ చార్జీలను ధరల పెరుగుదలకు అనుగుణంగా పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వమే వంట గ్యాస్‌ను సరఫరా చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకటేశ్వరమ్మ, అరుణ, వంశీ, రంగబాబు, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

నూజివీడు: పట్టణంలోని ఐటీఐ కళాశాల వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తుక్కులూరు పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న పల్లెపాం చరణ్ రాత్రి 7 గంటల సమయంలో తుక్కులూరు నుంచి నూజివీడు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఐటీఐ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. బాధితుడిని స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు రిఫర్ చేశారు. విషయం తెలుసుకున్న సర్పంచి తొమ్మండ్రు బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు పాలడుగు నాని, అచ్చి కాసులు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని బాధితుడిని విజయవాడ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తికి గాయాలు

తిరువూరు: లక్ష్మీపురం పాలశీతల కేంద్రం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన వాకా చిన నరసారావు ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపి ఫోను మాట్లాడుతుండగా వేగంగా వచ్చిన వ్యాన్ అతనిని ఢీకొట్టింది. నరసారావు ఎడమ కాలు విరిగి పోగా తలకు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని తిరువూరులోని ప్రైవేట్ నర్సింగ్‌హోంకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

ఆగిరిపల్లి: పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ శుభశేఖర్ తన సిబ్బందితో దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.10,900 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రేపు స్వర్ణాంధ్ర- 2047 పోటీలు

ముసునూరు: స్వర్ణాంధ్ర-2047 మండల స్థాయి పోటీలు శుక్రవారం నిర్వహిస్తామని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముసునూరులోని జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు స్వర్ణాంధ్ర-2047 ప్రణాళిక తయారీ, వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

నిరుపయోగంగా ఎత్తిపోతల పథకాలు

- కనీస నిర్వహణ లేక తుప్పపట్టిన మోటార్లు
- సాగునీరు లేక ఎండుతున్న ఆయకట్టు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు



సాగు నీరందించని కృష్ణారావుపాలెం ఎత్తిపోతల పథకం

తిరువూరు: మెట్టప్రాంతాల పొలాలకు సాగునీరందించే లక్ష్యంతో తిరువూరు నియోజకవర్గంలో గతంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు కనీస నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాల్లో ఎత్తిపోతల పథకాల కింద ఐదు వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉండగా కేవలం వెయ్యి ఎకరాలు కూడా ప్రస్తుతం సాగవడం లేదు. విస్సన్నపేట మండలంలోని నూతిపాడు ఎత్తిపోతల పథకం అత్యధికంగా రెండు వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో ప్రారంభించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు వచ్చే నీటి ఆధారంగా ఈ పథకాన్ని నిర్మించగా, ప్రస్తుతం సాగర్ జలాల సరఫరా లేక పథకం పూర్తిగా మూలపడింది. విస్సన్నపేట మండలంలోని వేమిరెడిపల్లి, విస్సన్నపేట, కొర్లమండ, పుట్రేల, కలగర గ్రామాలకు, ఏలూరు జిల్లాలోని చనుబండ, నరసింహారావుపాలెం గ్రామాలకు ఈ పథకం ద్వారా సాగునీరందించడం లక్ష్యంగా నిర్ణయించారు. ఈ పథకానికి ప్రభుత్వం రూ.15 కోట్లకు పైగా ఖర్చు చేసింది. దివంగత ఉప ముఖ్యమంత్రి కోనేరు రంగారావు కృషితో ఏర్పాటు చేసిన తిరువూరు మండలంలోని ముష్టికుంట్ల ఎత్తిపోతల పథకం సైతం నిర్వహణా లోపంతో నీరందించలేకపోతోంది. ఎరుకోపాడు ఎత్తిపోతల పథకం కూడా కొన్ని రోజులు మాత్రమే పనిచేసింది. మోటార్లు తుప్పుపట్టి పాడైపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొమ్మిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకం ప్రారంభించకుండానే మూలపడింది.

పనిచేయని పథకాలు..

ఎ.కొండూరు మండలంలోని మాధవరం, కృష్ణారావుపాలెం గ్రామాల్లో వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేందుకు నిర్మించిన రెండు ఎత్తిపోతల పథకాలు పనిచేయడం లేదు. ఈ రెండు పథకాలకు కూడా నాగార్జున సాగర్ మైలవరం బ్రాంచి కాలువ నీరే ఆధారం కాగా, ఇంత వరకు ఏ సీజన్‌లోనూ సాగర్ జలాలు సరిపడా రాక ఎత్తిపోతల పథకాలు పనిచేయలేదు. రాష్ట్రప్రభుత్వం మైనర్ ఇరిగేషన్ పథకాల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.



విస్సన్నపేట మండలంలో నిరుపయోగంగా ఉన్న నూతిపాడు ఎత్తిపోతల పథకం

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నూజివీడు: పట్టణంలోని విక్టోరియా పురమందిరంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో బుధవారం ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) బాస్కెట్‌బాల్ అండర్–14, అండర్–17 బాలబాలికల జట్ల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. పోటీలను నూజివీడు డీవైఈఓ ఎం. సేవియా ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ కృష్ణాజిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, 180 మంది క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరయ్యారు. పీడీలు వాకా నాగరాజు, రవీంద్ర, రాణి, వాకా వనజ, లక్ష్మి, సరళ, అన్నామణి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

బాలుర అండర్–17 జట్టుకు బి. బాలాజీ, డి. ఆస్టిన్, పి. రేవంత్, ఆర్. కేదార్‌కౌశిక్, పీజీ దుర్గామణికంఠ, రసూల్ అహ్మద్‌ఖాన్, బి. శ్రీహరినాథ్, ఎస్. లోకేష్, వి. చందు, ఎల్‌ఎన్‌ఎస్ఎస్ రూపేష్, షేక్ అమీర్ ఎస్ఎం, కే మణికంఠ, షేక్ అబ్దుల్ రెహమాన్, షేక్ ఆరిఫ్, ఏవీడీ సాయిహర్ష ఎంపికయ్యారు. అండర్–14 జట్టుకు జి. జగదీష్, కె. ఆకాష్‌సాయి, వై. కేతన్‌సాయి, షేక్ రిహాన్, బి. సాయిరోహిత్, జి. రాకేష్ వీరమాధవ్, కె. పవన్‌సాయి మణికంఠ, ఎ. ప్రణవ్‌రామ్, ఎ. వరుణ్‌సూర్య, కె. డానియేల్ నాష్, వి. తేజ వెంకట స్వరాజ్, ఎస్‌డీ జానీఫాజల్, డి. హర్ష, ఆర్. సుధీర్, ఎం. సుశాంత్ ఎన్నికయ్యారు. బాలికల అండర్–17లో బి. ప్రభుదీపిక, షేక్ ఆస్రా, బి. ప్రణవి, బీఎస్ఎల్ దుర్గ, టి. నవ్య, జి. ప్రణతి, ఎం. శశిశ్రీ, డి. భార్గవి, యూ. శరణ్య, డి. జ్యోత్స్న, కె. కీర్తనచాతుర్య, ఎ. శ్రావణి, కె. భావన, కె. రుత్విక, షేక్ ఆలియా అల్మాస్ ఎన్నికయ్యారు. అండర్–14లో బి. కుసుమ, ఆర్. వాహిని, బి. వర్షిణి, ఎం. కావ్యశ్రీ, ఎ. మైథిలీ, పి. షెజా, టి. నాగసుధ, జి. జెస్సీ, ఎ. ధృతి, డి. ఇందుప్రియ, కె. కీర్తన, వై. హమ్నా, వి. రియా, కేవీ దషిత, పి. కమలిక ఎంపికయ్యారు.



బాస్కెట్‌బాల్ అండర్–17 బాలికల జట్టుకు ఎంపికైన క్రీడాకారులు



బాస్కెట్‌బాల్ అండర్–17 బాలుర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ధర్నా

నూజివీడు: నూజివీడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఐసా) జిల్లా కార్యదర్శి గరికే అఖిల్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఐసా ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో డీఏఆర్ ఎయిడెడ్ కళాశాల అందుబాటులో ఉండేదని, ఇప్పుడు అది ప్రైవేటు కాలేజీగా మారినందున పేద వర్గాల పిల్లలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. డబ్బులు ఉన్నా, లేకున్నా కొందరు తమ పిల్లలను అప్పులు చేసి ప్రైవేటు కాలేజీలకు పంపుతున్నారని చెప్పారు. పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అందుబాటులోకి వస్తే నియోజకవర్గంతో పాటు విస్సన్నపేట, రెడ్డిగూడెం, బాపులపాడు తదితర మండలాలకు సంబంధించిన పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు డిగ్రీ చదువుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐసా పట్టణ కార్యదర్శి గోపి, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఐసా నాయకులు, విద్యార్థులు

చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు స్పందన

రెడ్డిగూడెం(మైలవరం): విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారిని చైతన్య పరిచేందుకే చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు జి. మల్లికార్జునరెడ్డి అన్నారు. మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం గీతాంజలి హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మొత్తం 982 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయా స్థాయిలలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

● **తిరువూరురూరల్:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు బుధవారం చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించామని జేవీవీ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్ తెలిపారు. 1600 మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి ఈ పరీక్షకు హాజరయ్యారన్నారు. పరీక్షలను జేవీవీ ప్రతినిధులు రాంప్రదీప్, సుబానీ, సుధాకర్, ఉషారాణి పర్యవేక్షించారు.



చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఎమ్మెల్యే కొలికపూడి వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా

క్షమాపణ చెప్పాలని జర్నలిస్టుల డిమాండ్

తిరువూరు: జర్నలిస్టులను అసభ్య పదజాలంతో దూషించడమే కాక దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వెంటనే క్షమాపణ చెప్పాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో మట్టి, ఇసుక అక్రమ తోలకాలపై వార్తలు రాసినందుకు విలేకరులను అసభ్య పదజాలంతో దూషించి బెదిరింపులకు పాల్పడిన ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ బుధవారం తిరువూరులో ఏపీయూడబ్ల్యూజే, ఏపీఎంపీఏ, ఏపీయూడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో బోసు సెంటర్ నుంచి నల్ల బ్యాడ్జీలతో ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. వెంకట్రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంటనే క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర స్థాయిలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఏపీఎంపీఏ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్, తిరువూరు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు గోపి, వెంకట నారాయణ, బద్రీ, మురళి, విజయ్, మహేష్, చెన్నారావు, ఆనందరావు, సత్యనారాయణమూర్తి, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల సంఘీభావం

జర్నలిస్టుల ఆందోళనకు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ గుమ్మా వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు, జెడ్పీటీసీ యరమల రామచంద్రారెడ్డి, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు, బీఎస్పీ నాయకులు సంఘీభావం తెలిపారు. విలేకరులను ఎమ్మెల్యే దూషించిన ఘటనను నిరసిస్తూ సామాజిక కార్యకర్తలు తిరువూరు ఆర్డీఓ మాధవికి మెమోరాండం సమర్పించారు.



ధర్నా చేస్తున్న పాత్రికేయులు

తిరువూరు ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

మైలవరం: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తాను ప్రజాప్రతినిధి అనే విషయం మర్చిపోయి ఓ వీధి రౌడీలా రోడ్డుపైరెచ్చగొట్టే పద్ధతిలో ఓ సర్పంచిని, విలేకరులను దూషించారని, ఇది మంచి పద్ధతి కాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనలపై ముఖ్యమంత్రి స్పందించి తిరువూరు ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తక్షణమేసర్పంచ్‌కు జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆలయాలకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలి

చాట్రాయి: ఆలయాల భద్రతపై నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని నూజివీడు సీఐ రామకృష్ణ అన్నారు. చనుబండ కోదండ రామాలయం ఆవరణలో ఆలయ భద్రతలపై స్థానికులకు బుధవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆలయాలకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఎస్ఐ రామకృష్ణ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు



మైలవరం: మైలవరం నూజివీడు రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద ఏర్పాటు చేసిన గణపతిని బుధవారం నిమజ్జనానికి తరలించారు. వినాయక చవితి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుని విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉంచి ప్రధాన వీధుల్లో బ్యాండ్ మేళ తాళాలతో ఊరేగించారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద నిమజ్జనం చేశారు.

స్టేషనరీ వితరణ

కొణిజెర్ల(గంపలగూడెం): కొణిజెర్ల హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రానికి దాత రూ.15 వేల విలువైన స్టేషనరీని బుధవారం వితరణగా ఇచ్చారు. గ్రామంలోని పద్మావతి గార్డెన్ యజమాని నంబూరి హరిప్రసాద్, పద్మావతి దంపతుల సౌజన్యంతో కేంద్రానికి అవసరమైన స్టేషనరీ, కుర్చీలు, డోర్, విండో కర్టెన్లు, బెడ్‌షీట్లు కొనుగోలు చేసి అందజేశారు.

ట్రాఫిక్‌పై అవగాహన

ఆగిరిపల్లి: స్థానిక పెద్ద కొఠాయి వద్ద వాహనదారులకు, దుకాణదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎస్ఐ శుభశేఖర్ మాట్లాడుతూ వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపేవారు, రహదారులు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బీవీఆర్ కుటుంబానికి రుద్రరాజు పరామర్శ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇటీవలి కాలంలో మృతిచెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ బొర్రా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పరామర్శించారు. కొండపల్లిలోని బీవీఆర్ కుమారుడు, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ నివాసానికి బుధవారం ఆయన విచ్చేశారు. వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాయకులు ధనేకుల మురళీమోహన్‌రావు, ఎస్.మోహన్‌రావు, ఏసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మందులు పంపిణీ

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. మైలవరం మండలం చంద్రాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 984 మంది విద్యార్థులకు ఉచితంగా నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి. శివహరిప్రసాద్, చంద్రాల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ఉడతా లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరువూరు: మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మందులు పంపిణీ చేశారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నులి పురుగుల నివారణ మందులను వేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శంకరరావు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

తిరువూరురూరల్: చౌటపల్లి, రాజుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులు వేశారు. నులి పురుగుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది వివరించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్

నూజివీడు: యువత మద్యం, కొకైన్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ పి. సత్యశ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల వద్ద పట్టణ సీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటవ్వడం వల్ల ఆరోగ్యం పాడవడంతో పాటు అనేక సామాజిక సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్లకు వచ్చే లింకులను నొక్కవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని సూచించారు. మీ చుట్టుపక్కల ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వెంటనే 112కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. ఏఎస్ఐ ఖాసిం బేగ్, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సత్య శ్రీనివాస్

ఎల్బీఆర్సీఈ అధ్యాపకులకు పీహెచ్‌డీ ప్రదానం

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు కొమ్మూరు వెంకట్రావు కంప్యూటర్ సైన్స్ విభాగంలో చేసిన పరిశోధనకు వీఐటీ-ఏపీ యూనివర్సిటీ పీహెచ్‌డీ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిశోధనలో మెరుగైన దీర్ఘకాలిక మూత్ర పిండాల వ్యాధి అంచనా, వర్గీకరణ కోసం ఐఓటీ ఆధారిత లోతైన అభ్యాస నమూనాలను విశదీకరించారన్నారు. అలాగే కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ విభాగంలో అధ్యాపకురాలు షేక్ నల్మా ఆసియా బేగం వీఐటీ ఏపీ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో పెప్పర్ అండ్ కార్న్ లీఫ్ డిసీజ్ క్లాసిఫికేషన్ అండ్ సివియారిటీ ఐడెంటిఫికేషన్ యూజింగ్ హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ అప్రోచెస్ అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ పొందిన అధ్యాపకులను ప్రిన్సిపాల్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.



అధ్యాపకురాలు షేక్ సల్మా ఆసియా బేగంను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అప్పారావు

డీవైఈఓ ఆకస్మిక తనిఖీ

ముసునూరు: నూజివీడు డీవైఈఓ సేవియా నాయక్ బుధవారం చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించి, 10 కి 10 గ్రేడులను అందరూ సాధించాలని కోరారు. ఇప్పటి నుంచే క్రమశిక్షణ, కఠోర దీక్షతో విద్యాభ్యాసం చేసి విజయం సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులంతా సమకాలీన పోటీ పరిస్థితులకు అనుగుణంగా, పాఠ్య ప్రణాళిక ప్రకారమే విద్యా బోధన చేయాలని ఆదేశించారు. ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలోనికి వెళ్లే ముందే పాఠ్యాంశ బోధనపై పాఠ్య ప్రణాళిక ప్రకారం పూర్తిగా సిద్ధపడి, తగిన సమాచారం, బోధన ఉపకరణాలతో తరగతిలోకి వెళ్లాలని సూచించారు. మధ్యాహ్న భోజనం రుచి, శుచి, నాణ్యతలపై ఆరా తీసి, మెనూ ప్రకారమే ఆహార పదార్థాలను రుచిగా శుచిగా వండి విద్యార్థులకు వడ్డించాలని హెచ్ఎం అబ్బాస్‌కు సూచించారు.

అనంతరం పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ రికార్డులను తనిఖీ చేశారు. స్టాఫ్ సెక్రటరీ పద్మకిషోర్, ఉపాధ్యాయులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈఓ

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

ఇబ్రహీంపట్నం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, బీజేపీ హైందవ సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం బీజేపీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మారాసు కృష్ణమోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

● **మైలవరం:** మైలవరం బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు తోట నాగేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ పి.వెంకటేశ్వరరావు నాయకులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజల దృష్టిని మరల్చేందుకే లడ్డూ వివాదం

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్

నూజివీడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజులైనా ఇప్పటివరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యమేనని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. హరినాథ్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వంపై నిరసన గళం వినిపించకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే లడ్డూ వివాదాన్ని రెచ్చగొట్టటం ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల దివాళాకోరు రాజకీయాలను ప్రస్ఫుటం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కల్తీ, అవినీతి సర్వత్రా వ్యాప్తి చెందిందని, కేవలం లడ్డూలోనే లేదని, తినే అన్ని వస్తువులలోను ఉందని, దాన్ని ప్రక్షాళన చేయడం, నివారించడం అవసరమేనన్నారు. ప్రజల మధ్య మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టే విధంగా నాయకులు ప్రసంగాలు చేయడం శ్రేయస్కరం కాదన్నారు. ప్రజల తక్షణ అవసరాలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం దృష్టి సారించాలని, విలువైన సమయాన్ని గందరగోళ అంశాలతో ప్రజలను రెచ్చగొట్టి వారి జీవితాలతో ఆటలాడుకోవడం మంచిది కాదన్నారు.

ఇన్‌చార్జి ఎస్ఐగా రాజారెడ్డి

ముసునూరు: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఇన్‌చార్జి ఎస్ఐ కొవ్వూరు రాజారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఇన్‌చార్జి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

చాట్రాయి: రైతులు ఆధునిక వ్యవసాయంపై ఆసక్తి చూపాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. బుధవారం చాట్రాయిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రసాయనిక ఎరువులను వినియోగించకుండా సేంద్రియ ఎరువులను వాడాలని, సమగ్ర పోషక విలువలు గల యాజమాన్య పద్ధతులు పాటించాలని, మిర్చి సాగులో మల్చింగ్ విధానం లాభసాటిగా ఉంటుందని ఆయన వివరించారు.

ముసునూరు: అక్కిరెడ్డిగూడెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంట క్షేత్రాన్ని సిబ్బంది, రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. వీహెచ్ఏ వై.సురేష్, సిబ్బంది శారమ్మ, పద్మ, నాగమణి, సర్పంచ్ పులిబళ్ల లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

నూరు శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ఆగిరిపల్లి: నూరు శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాల లబ్ధిదారులు మార్చి 2025 నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ అబ్దుల్ సలాం, హౌసింగ్ ఏఈ పాల్గొన్నారు.